క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు నాలుగు గంటలపాటు అంతరాయం కలుగుతుందని ఈడీఈ గోవిందు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేసే 33 కేవీ మద్దెలబండ ఫీడర్‌పైన అత్యవసర మరమ్మతు కోసం ఎల్‌సీ తీసుకోనున్నారని తెలిపారు. దాంతో 33 కేవీ మద్దెలబండ ఫీడర్‌పై ఉన్న 33/11 కేవీకి సంబంధించిన నాగర్‌దొడ్డి, మద్దెలబండ, తాటికుంట సబ్‌స్టేషన్‌లకు శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గట్టు, ఆలూరు సబ్‌స్టేషన్ల పరిధిలో..

గట్టు: గట్టు, ఆలూరు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం కలుగనున్నట్లు ఏడీఈ గోవిందు, ఏఈ చెన్నయ్య తెలిపారు. అయిజ 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి గట్టుకు వచ్చే 33కేవీ విద్యుత్ లైన్ అత్యవసర మరమ్మతు కోసం గట్టు ఫీడర్‌పై ఎల్‌సీ తీసుకుంటున్నట్లు తెలిపారు. గట్టు, ఆలూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధరూరు మండలంలో..

ధరూరు: మండలంలో శనివారం విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ రమేష్‌బాబు తెలిపారు. 132/33కేవీ గద్వాల సబ్‌స్టేషన్ నుంచి మార్లబీడు ఫీడర్‌కు చెట్ల కొమ్మలు తాకడంతో తరచూ అంతరాయం ఏర్పడుతుండటంతో మార్లబీడు ఫీడర్‌కు ఎల్‌సీ తీసుకుని కొమ్మలు నరకనున్నట్లు చెప్పారు. అలాగే అల్వలపాడు ఫీడర్లో కూడా రెండు ఫీడర్లలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు కోతలు విధిస్తున్నట్లు వివరించారు.

రూ.71,960 నగదు పట్టివేత

గద్వాల క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం గద్వాల మండలంలోని సంగల పార్కు సమీపంలో రూరల్ ఎస్‌ఐ ఆనంద్, సిబ్బంది వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో రూ.71,960 నగదును సీజ్ చేసినట్లు ఎస్పీ రితిరాజ్ తెలియజేశారు.

14.6 లీటర్ల మద్యం..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల పరిధిలోని చాగాపురానికి చెందిన బస్వరాజు ఎలాంటి అనుమతులు లేకుండా తన షాపులో మద్యాన్ని విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో శుక్రవారం తనిఖీ చేశామని పోలీసులు తెలిపారు. తనిఖీ చేసి 14.6 లీటర్ల మద్యాన్ని జప్తు చేసుకున్నామని చెప్పారు. జప్తు చేసుకున్న మద్యాన్ని పీఎస్‌కు తరలించి వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ అశోక్‌బాబు తెలియజేశారు.

ఉండవెల్లిలో నకిలీ పురుగు మందు..

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జై హనుమాన్ ట్రేడర్స్‌లో ఒక ప్రైవేట్ కంపెనీకి చెందిన నకిలీ పురుగు మందులు అమ్ముతున్నారని మహబూబ్‌నగర్ జిల్లా మాగనూరుకు చెందిన కంపెనీ ప్రతినిధి సీనియర్ అసోసియేట్ మోహన్ రావు ఫిర్యాదు మేరకు శుక్రవారం దుకాణ యజమాని రాజేష్, మోహన్ రావ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలియజేశారు. దుకాణంలో ఒక కంపెనీకి చెందిన దాదాపు రూ.12 వేలు విలువ చేసే నకిలీ పురుగు మందు దొరికినట్లు చెప్పారు.

లింగన్‌వాయిలో పీడీఎస్ బియ్యం

అలంపూర్ రూరల్: మండల పరిధిలోని లింగన్‌వాయిలో 9 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ మదుగు రమేష్ తెలిపారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం లింగన్‌వాయికి చెందిన మౌలాలి గుడిసె వద్ద 9 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

రాజోళి: ఆర్‌ఎంపీగా సేవలందిస్తూ.. గురువారం మృతిచెందిన మద్దిలేటి(40) కుటుంబానికి ఆర్‌ఎంపీ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని తుమ్మిళ్లకి చెందిన మద్దిలేటి కొన్నేళ్లుగా అదే గ్రామంలో ఆర్‌ఎంపీగా సేవలందిస్తున్నాడు. ఈ క్రమంలో గత వారంలో ఆయనకు మెదడులో రక్తం గడ్డ కట్టడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆర్‌ఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి శుక్రవారం రూ.40 వేలు అందజేశారు. మద్దిలేటి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.హుస్సేన్, తిమ్మారెడ్డి, మాధవ కృష్ణ, ప్రభాకర్, దుర్గా రెడ్డి, భాస్కర్ ధర్మ తదితరులు పాల్గొన్నారు.



స్థానికేతరులకు ఓటేస్తే ముంచేస్తారు

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



గద్వాలలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: నాలుగేళ్ల పాటు అధికారం అనుభవించి కేవలం తనకు పదవి కావాలనే ఆకాంక్షతో నమ్మిన పార్టీకి వెన్నుపోటు పొడిచి, పార్టీ మారిన వ్యక్తుల మాటలకు మోసపోతే నష్టపోతామని, అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మరోసారి ఓటేసి గెలిపించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గద్వాల పట్టణం, గద్వాల, ధరూరు, గట్టు, కేటీదొడ్డి, మల్దకల్ మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. అనంతరం మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పాలన అంటేనే స్కాముల పాలన గుర్తుకొస్తుందని విమర్శించారు. పదేళ్లుగా సీఎం కేసీఆర్ అవినీతి అక్రమాలకు తావులేకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారన్నారు. మీ ఆశీర్వాదంతో గెలిచిన నేను ఈ ఐదేళ్లు మీవెంటే నడిచానన్నారు. ప్రజలందరూ ఆలోచించి బీఆర్‌ఎస్‌కి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పట్టణంలో ఇంటింటి ప్రచారం..

గద్వాల పట్టణ ప్రజలందరూ బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని ఈ పట్టణ భవిష్యత్ మీ చేతిలోనే ఉందని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. పదేళ్లుగా గద్వాల పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకున్నామని, మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాల్సిన అవసరముందన్నారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గద్వాల మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు.

24 గంటల కరెంటు కావాలా వద్దా..

గట్టు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంటు కావాలా... కాంగ్రెస్ ఇచ్చే 3 గంటల కరెంట్ కావాలో రైతులు తేల్చుకోవాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం తుమ్మలచెరువు, బస్వాపురం, బింగిదొడ్డితండా, నల్లగట్టుతండా, వాయిల్‌కుంటతండా, ఆలూరు, రాయాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడారు. తండాలను పంచాయతీలుగా గుర్తించినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు గిరిజన తండాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి వైపునకు తీసుకెళ్తున్నట్లు తెలియజేశారు. గిరిజన విద్యార్థుల కోసం ఎస్టీ గురుకులాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, రైతు బంధు, రైతు బీమా, పింఛన్లు, కల్యాణలక్ష్మీ పథకం ద్వారా రూ.1,00,116లను అందించి ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచినట్లు తెలిపారు. గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, హనుమంతు, రామకృష్ణారెడ్డి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, అంగడి బస్వరాజు పాల్గొన్నారు.

రైతులకు బాసటగా బీఆర్‌ఎస్

కేటీదొడ్డి: రైతులకు బాసటగా బీఆర్‌ఎస్ నిలుస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు గోపి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెంకటాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గద్వాల అభ్యర్థి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు.

కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి

మల్దకల్: కేసీఆర్‌తోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని, దేశంలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మల్దకల్ సంత బజార్‌లో మహిళా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగినట్లు చెప్పారు. గట్టు తిమ్మప్ప, శ్రీధర్‌గౌడ్, రాజారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





బింగిదొడ్డి తండాలో మాట్లాడుతున్న కృష్ణమోహన్‌రెడ్డి, మల్దకల్‌లో సమావేశానికి హాజరైన మహిళలు

ప్రైవేటు ప్లాట్లతో పరేషాన్

- దట్టంగా పెరిగిన ముళ్లపొదలు
- విషసర్పాలు, పందులు, కుక్కలు సంచరిస్తున్నాయని పట్టణ వాసుల ఆందోళన
- యజమానులపై చర్యలు తీసుకుని శుభ్రం చేయించాలని కోరుతున్న పట్టణ వాసులు

శాంతినగర్: మున్సిపాలిటీల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రైవేటు ప్లాట్లు ఇబ్బందికరంగా మారాయి. ప్లాట్లు కొనుడేగాని వాటి గురించి పట్టించుకునే వారు కరువవడంతో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో నిండి అడవిలా అగుపిస్తున్నాయని పట్టణవాసులు వాపోతున్నారు. అక్కడక్కడ ఇళ్లు ఉండటం, మధ్యలో ఖాళీ స్థలాలు నిరుపయోగంగా మారడంతో ముళ్లపొదలు దట్టంగా పెరిగి పందులు, కుక్కలు, విషసర్పాలకు ఆవాసాలుగా మారాయని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి, అయిజ, అలంపూర్ మున్సిపాలిటీల్లో పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ విషయమై మున్సిపాలిటీ అధికారులు స్పందించి ప్రైవేటు ప్లాట్ల యజమానులపై చర్యలు తీసుకుని ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అడవిలా ఉంటుంది..

వడ్డేపల్లి మున్సిపాలిటీ అనుడేగాని కాలనీలు మాత్రం అడవులను తలపిస్తున్నాయి. మా ఇళ్ల సమీపంలో ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. యజమానులు ఎక్కడుంటారో తెలియదు. ఐదేళ్లయినా ప్లాట్లలో ఉన్న ముళ్లపొదలు తొలగించడం లేదు. దీంతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. బయటకు వెళ్లాలంటే భయమేస్తుంది.

– నర్సింహులు, రామాలయ వీధి, శాంతినగర్

చర్యలు తీసుకుంటాం..

ప్రైవేటు ప్లాట్లు శుభ్రంగా ఉంచుకోవాలని గతంలో పనిచేసిన కమిషనర్, మేనేజర్లు నోటీసులు పంపించారని తెలిసింది. మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశమై ప్రైవేటు ప్లాట్ల పరిస్థితిపై చర్చిస్తాం. ప్లాట్లలో ఇబ్బందికరంగా మారిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్, వడ్డేపల్లి

పందులకు నిలయాలుగా మారాయి..

ప్రైవేటు ప్లాట్లు పందులకు నిలయాలుగా మారాయి. ముళ్లపొదల్లో పందులు ఉంటూ ఇళ్ల ముందుకు వస్తుంటాయి. బురదలో నుంచి పందులు వస్తున్నందున దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మద్దిలేటి, రామచంద్రానగర్, శాంతినగర్



రామచంద్రానగర్ కాలనీలో ముళ్లపొదలతో ఇబ్బందికరంగా ఉన్న ప్రైవేటు ప్లాట్లు

జోరుగా ఎన్నికల ప్రచారం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి, షేకుపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్, చాగాపురం, ఉదండాపురం, కొండేరు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు.

అన్నిరంగాలకు పెద్దపీట

గద్వాల అర్బన్: అన్నిరంగాలకు పెద్దపీట వేసేలా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను రూపొందించిందని కాంగ్రెస్ అభ్యర్థి సరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమంతో పాటు విద్య, వైద్యం, రైతాంగం, మహిళలు, ఉద్యోగులకు సమాన న్యాయం చేస్తూ మ్యానిఫెస్టో ఉందన్నారు. అనంతరం గద్వాల 27, 36, 25వ వార్డుల్లో ప్రచారం చేశారు.

జోగుళాంబ అమ్మవారికి 108 టెంకాయలు

జోగుళాంబ శక్తిపీఠం: గద్వాల కాంగ్రెస్ అభ్యర్థి సరిత గెలవాలని దౌదర్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు జోగుళాంబ అమ్మవారికి 108 టెంకాయలు కొట్టారు.

బీఆర్‌ఎస్‌లోకి చేరికలు

మానవపాడు: బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు, నాయకులు బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రశేఖర్‌నగర్ సర్పంచ్ ఉషారాణి, నాయకులు రాంబాబు, పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారన్నారు. ఆంజనేయులు గౌడ్, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపిద్దాం

శాంతినగర్: అలంపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి విజేయుడుని భారీ మెజార్టీతో గెలిపిద్దామని వడ్డేపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ అన్నారు. శాంతినగర్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది..

ఉండవెల్లి: రైతుకు అండగా అందరూ ఉండాలంటే కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి బొంకూరులో అన్నారు. శుక్రవారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

మహిళలకు ఉచిత ప్రయాణం

రాజోళి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుందని అలంపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సంపత్ కుమార్ సతీమణి మహాలక్ష్మి అన్నారు. మండలంలోని ముండ్లదిన్నెలో ఆమె శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ.. కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

మానవపాడు: అలంపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కలుకుంట్ల, ఎ.బుద్ధిపాడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్

మానవపాడు: మండలంలోని అమరవాయిలో శుక్రవారం కోఆప్షన్ మెంబర్ మహ్మద్ సిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ, హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

గడప గడపకు బీజేపీ

అలంపూర్ రూరల్: మండల పరిధిలోని లింగన్‌వాయి, క్యాతూర్ గ్రామాల్లో శుక్రవారం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్ ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ.. ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

దేవుడిపై భయభక్తులు కలిగి ఉండాలి

ధరూరు: గుణవతి స్త్రీ తన ఇంటిని చక్కబెట్టుకొనునని జీజీఎస్ వ్యవస్థాపకులు ఎమ్మిగనూర్‌కు చెందిన రెవ ఎస్ మేరీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మార్లబీడులోని ఎంబీ హెర్మోను సంఘం ఆధ్వర్యంలో ఒక్క రోజు స్త్రీల కూడిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'సంఘంలో స్త్రీ ప్రాత' అనే అంశంపై ఆయా గ్రామాల నుంచి వచ్చిన స్త్రీలనుద్దేశించి ఆమె వివరించారు. నీవు ఎంత పెద్ద ధనికురాలివైనా.. నీవు చర్చిలో ఎంత కానుక ఇచ్చినా.. దేవుని యందు భయ భక్తులు కలిగి ఉంటేనే నీకు దేవుని కృప మీపై ఉంటుందని సూచించారు. నూతన స్వభావంతో ముందుకు సాగాలన్నారు. పాతవి గతించి కొత్తవాయెనని బైబిల్ వ్యాక్యానుసారంగా వివరించారు. నీ నడక యందును, నీ ప్రర్తన యందును మీ మనసులను మార్చుకుని మీ హృదయాలను దేవునికి సమర్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంఘ సేవకురాలు జేఏ మహిమ రూత్ ఆన్డ్రూస్, సంఘ కమిటీ సభ్యులు, ఆయా సంఘాల పాస్టరమ్మలు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెవరెండ్ ఎస్ మేరి ప్రసాద్

ప్రజా ఆశీర్వాద సభకు తరలిరండి

శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గంలోని శాంతినగర్‌లో ఆదివారం నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు వేలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్‌వీ పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ గడ్డం భరత్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు.

లారీ బోల్తా

అడ్డాకుల: మూసాపేట మండలం అచ్చాయపల్లి సమీపంలో జాతీయ రహదారిపై అదుపు తప్పి లారీ(కంటెయినర్) బోల్తా పడిన ఘటనలో అదృష్టవశాత్తు డ్రైవర్‌కు ముప్పు తప్పిపోయింది. బాధితుడి వివరాల ప్రకారం... శాఖాపూర్ గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డి బెంగళూర్ నుంచి లారీని హైదరాబాద్ తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యలో శుక్రవారం తెల్లవారుజామున అచ్చాయపల్లి స్టేజీ వద్ద కల్వర్టు దాటిన తర్వాత లారీ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

మల్దకల్: ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఎల్కూరు, పెద్దపల్లి, మల్దకల్ గ్రామాల్లో ఎస్‌ఐ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. ఆయా గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు ఈ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కళాకారులతో కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పురవీధుల వెంట సీఆర్‌పీఎఫ్ పోలీసులు తిరుగుతూ ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించారు. కార్యక్రమంలో కళాజాతా బృందం సభ్యులు రాధమ్మ, హన్మంతు, కృష్ణ, రామాంజనేయులు, పోలీసులు పాల్గొన్నారు.



సీఆర్‌పీఎఫ్ పోలీసుల కవాతు



ఎల్కూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్

ఆడపిల్లలను చదివిద్దాం..



విద్యార్థులకు బాలలహక్కులపై అవగాహన కల్పించి బహుమతులు అందజేసిన అధికారులు

కేటీదొడ్డి: బాలల హక్కుల వారోత్సవాలు పురస్కరించుకుని బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలోని మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సంక్షేమ అధికారిని ముషాహిదా బేగం, జిల్లా విద్యాశాఖ అధికారి సిరాజుద్దీన్ హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాలవివాహాలను అరికట్టేందుకు 100 లేదా 1098కి నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012 గురించి వివరించారు. అలాగే వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ అధికారి హంపయ్య, డీసీపీఓ నరసింహ, హెచ్‌ఎం రెడ్యానాయక్, ఉపాధ్యాయులు నర్సింహులు, సోషల్‌వర్కర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను వ్యతిరేకించాలి

గట్టు: బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా వాటిని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ, జిల్లా సంక్షేమ అధికారిణి ముసాయిదాబేగం తెలిపారు. శుక్రవారం గట్టు గురుకుల పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బాలల సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ ముసాయిదా బేగం మాట్లాడారు. బాల్యం ఎంతో విలువైందన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్యవివాహాలను వ్యతిరేకించాలని, బాల కార్మికులు లేని సమాజాన్ని సృష్టిద్దామన్నారు. చిన్నారులపై శారీరక, మానసిక, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు 1098, లేక 100కు కాల్ చేయాలన్నారు. ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీలతో పాటుగా ముగ్గుల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీసీపీఓ నర్సింహ, గురుకుల ప్రిన్సిపాల్ వాణి, ఓఆర్ఓ లక్ష్మీదేవి, చైల్డ్‌లైన్ కౌన్సిలర్ జయన్న, డీసీపీయూ కౌన్సిలర్ సురేష్, సామాజిక కార్యకర్త పద్మ, గురుకుల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంపద వనం పరిశీలన

ధరూరు: మండల పరిధిలోని మార్లబీడు గ్రామ శివారులోని సంపద వనాన్ని సీఈఓ, ఇన్‌చార్జి డీఆర్‌డీఓ కాంతమ్మ పరిశీలించారు. చెట్లతో పాటు ఉన్న కలుపు మొక్కలను తొలగించాలని, డ్రాపులు పడిన చోట తిరిగి కొత్తగా మొక్కలను నాటాలని ఆదేశించారు. ఆ మొక్కలను పెరిగేలా చూసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలు ఎండకుండా చూడాలని సూచించారు. అనంతరం ధరూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సంపద వనంపై ప్రత్యేక దృష్టిసారించి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎండీ జబ్బార్, ఎంపీఓ కృష్ణమోహన్, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



మార్లబీడులో సంపద వనాన్ని పరిశీలిస్తున్న సీఈఓ కాంతమ్మ

'బహుజన వాదం ముసుగులో సీడ్‌మాఫియాకు వత్తాసు'

గద్వాల రూరల్: కొందరు నాయకులు నడిగడ్డ ప్రాంతంలో బహుజన వాదం ముసుగు వేసుకుని సీడ్ మాఫియాకు వత్తాసు పలుకుతున్నారని, కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యే టికెట్లను అమ్ముకున్నాడని బీఆర్‌ఎస్ నాయకులు కురువ విజయ్‌కుమార్, పటేల్ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కోసం అనేక ఏళ్లుగా పనిచేసిన తమను పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పట్టించుకోలేదని, కొత్తగా కాంగ్రెస్‌లో చేరిన వారికి రూ.కోట్లకు టికెట్లను అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో ఎంతోమంది బహుజనవాదులు ఉన్నారని, అలాంటి వారికి అవకాశం కల్పించలేదన్నారు. సీడ్‌మాఫియా, నయీమ్ గ్యాంగ్ వారికి కాంగ్రెస్ టికెట్ కేటాయించిందని ఆరోపించారు. అనంతరం కురువ విజయ్‌కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరారు.

నిల్వ నీటితో వ్యాధులు

రాజోళి: ఇళ్ల వద్ద నిల్వ ఉండే నీటితో వ్యాధులు ప్రబలుతాయని వైద్య సిబ్బంది తెలియజేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఫ్రైడే, డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు కాలనీల్లో తిరుగుతూ.. పలు జాగ్రత్తలు సూచించారు. ప్లాస్టిక్ డ్రమ్ములు, నీటి తొట్టెలు, టైర్లు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఆ నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది, వ్యాధులు ప్రబలుతాయని తెలియజేశారు. ప్రతి వారం వాటిని శుభ్రం చేసుకోవాలని, దోమలు వ్యాప్తిచెందకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి నాయకుల పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల పరిధిలోని శివనంపల్లి సర్పంచ్ గోవిందమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సతీమణి మహాలక్ష్మి శుక్రవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేసి, నాయకులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. నాగశిరోమణి, రుక్మాందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, రామకృష్ణారెడ్డి, శేఖర్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.